విలువ కట్టలేనిది



ఎమ్. హేమలత

ఆఫీసునుండి వస్తూనే, పాంటు జేబులో నుండి ఒక కవరు తీసి పద్మ చేతిలో పెట్టాడు వెంకట్రావు. "ఎక్కడిది?", అన్నట్లు భర్తవేపు ప్రశ్నార్థకంగా చూసింది పద్మ, "చదువు, నీకే తెలుస్తుంది" అంటూ టవలు తీసికొని స్నానానికి వెళ్ళిపోయాడు. "ఎవరు రాసారమ్మా? తాతయ్యగారా?" అంటూ పదేండ్ల గిరిజ పద్మవేపు ఆసక్తిగా చూసింది. "ఏమో! చదవనీ" అంటూ ఉత్తరం విప్పింది పద్మ.

ప్రియమైన అన్నయ్యకి,

ఇక్కడ మేమందరం క్షేమం. అక్కడ మీరందరు క్షేమమనుకుంటాను. చి|| శైలు ఈ మధ్యనే ఫ్లూ జ్వరంతో బాధపడింది. ఇప్పుడు కులాసాగానేవుంది. అక్కడ చిరంజీవులు గిరిజ, జలజ, రాము కులాసా అనుకుంటాను.

అన్నయ్యా, మీ బావగారిని ఆఫీసువాళ్ళు ట్రెయినింగ్‌కి బొంబే పంపిస్తున్నారు. రెండు నెలలు వుంటారు. ఫామిలీ ప్లానింగ్ ట్రెయినింగ్ కొరకు నేనుకూడ వెళ్ళవలెనని వున్నాను. శైలుతోటే మాకు చిక్కు వచ్చిపడింది. శైలుని ఈ రెండు నెలలు మీ దగ్గరే వుంచుదామని వుంది. అమ్మ దగ్గర అయితే దానికి కంపెనీ వుండదు. అందులో అది మరీ పల్లెటూరు. దీనికి అస్తమానం ఏదో ఒక సు స్తీ చేస్తూ వుంటుందాయె. నేను, శైలు ఆదివారం బయలుదేరి అక్కడికి వస్తు న్నాము. వదినను అడిగినట్లు చెప్పేది. ఇంతే,

ఇట్లు
మంజుల.

ఉత్తరం చదవడం అవగానే దాన్ని టేబిల్‌మీద పెట్టి, పద్మ భర్తకి కాఫీ తీసుకు రావడానికి లోపలికి వెళ్ళింది. ఉత్సుక తను చంపుకోలేని గిరిజ ఉత్తరం చదవ సాగింది. వెంకట్రావు గదిలోకి రాగానే "నాన్నా! శైలు, అత్తయ్య వస్తారట కదా! శైలు మనింట్లోనే వుండిపో తుందా?" అంటూ ఎంతో అమాయ కంగా, సంతోషంగా అడిగింది. "ఏమో నమ్మా! హోమ్ మినిష్టర్ పర్మిషన్ కావాలిగా ముందు" అంటూ భార్య చేతి లోని గ్లాసు అందుకున్నాడు. "పాపం ! అప్పటికి నా మాట జవదాటనట్లు!" పద్మ తననీ, తన సంసారాన్నీ ఎన్నో తప్పులు పట్టింది. పిల్లలకి క్రమశిక్షణ నేర్పటం తెలీదు అంది. పిల్లలకి సరయిన ఆహారం ఇవ్వడంలేదని చెప్పింది. ఎంతయిన డాక్టరు కదా! ఆవిడలాగ పెంచడం తనకెలా చాతనవు తుంది. అని సరిపెట్టుకుంది పద్మ. కాని ఆ ఎత్తిపొడుపులు, హేళనా పూరిత వాక్కులు పద్మమర్చిపోలేదు. ఒక్కనాడు తన పిల్లలను పిలిచి తన యింట్లో వుంచుకోలేదు. తను వచ్చినా, పట్టుమని పదిరోజులు వుండకుండ తుర్రుమనేది ఇప్పుడు అవసరం తనది కదూ! ఎంతో వినయంగా ఉత్తరం వ్రాసింది "మీరే మంటారు రాణీగారూ !" అన్నాడు వెంకట్రావు పేపరు అందుకుంటూ. "అదేంటండీ! నన్నడుగుతారు? అన్న గారాయె, చెల్లెమ్మాయె ! నేనెవర్ని మధ్యన? నేను వద్దంటే మాత్రం ఆవిడ రాకుండా వుంటుందా? మీరు రమ్మన కుండా వుంటారా?". పద్మ జలజని కేకేసి, దాని జడలు విప్పడం మొద లెట్టింది.

"పద్మా! మంజుల పరిస్థితి కూడా కొంచెం అలోచించు. అసలే దానికి పిల్ల మీద మమకారం ఒక పాలు ఎక్కువ" "ఆ మాటే అనొద్దంటాను! ఎవరి పిల్లలు ఎవరికి ఎక్కువకాదు.!" "ఆవేశ పడకు మరి! ఒక్కగానొక్క పిల్ల. అందులో

కాదు ఎటూ వీలుకాని పరిస్థితి. ఒక రెండు నెలలే కదా! మనింట్లో వుండనీ" "ఇప్పుడు నేను కాదన్నానటండీ! ఎటొచ్చీ డాక్టరు మంజులలాగ పిల్లల్ని పెంచడంమాత్రం నాకురాదన్నదిమీరిద్దరు మర్చిపోకండి" జలజ జడకి రిబ్బను బిగిస్తూ అంది పద్మ "ఊ...సరేలే... ఎప్పటి మాటలో పట్టుకుని ఇప్పుడు దెప్పుతున్నావు! అయినా మంజుకి ఎవ రున్నారు! మనం తప్ప. మన మీద ఆపేక్షవల్లకాని లేకుంటే దాని కూతుర్ని లక్షవరహాలు పోసినా మనింట్లో వుంచు తుందా?" "సరే! ఆ లక్షవరహాలేవో మీరే ఏరుకుందురుగాని నాకు పనుంది" అంటూ లోపలికి వెళ్ళిపోయింది పద్మ.

తన చెల్లెలు మంజులకి, పద్మకి చాలా విషయాల్లో అభిప్రాయ భేదాలు వున్నవి అన్న విషయం వెంకట్రావుకి తెలియక పోలేదు. కాని ఇంటికొచ్చిన అతిథిని అవమానించేంత కుత్సిత బుద్ధి మాత్రంకాదు పద్మది అన్న నమ్మకమే వెంకట్రావుకి ధైర్యాన్నిచ్చింది.

శైలు వచ్చినందుకు పిల్లలు గంతు లేశారు. కలిసిపోయి ఆడుకున్నారు. ఎప్పుడూ హాస్పిటల్ అనే చెల్లెలు, సావకాశంగా ఇంట్లో కూచుని కబుర్లు చెబుతూంటే వెంకట్రావుకి ముచ్చటే సింది. పద్మ కూడ ఆడబడుచుకి ఏలోటు లేకుండ అన్నీ చేసిపెట్టింది. మూడు పోయాయి.

ఆ రోజే మంజుల వెళ్ళేరోజు. శైలు, తీరా తను వెళ్ళేటప్పుడు గోల చేస్తుం దేమో అని అన్నయ్యతో పార్కుకి పంపేసింది. ముందుగానే అన్నయ్య దగ్గర వీడ్కోలు తీసుకుంది. పద్మ, మంజుల ఇద్దరు కలిసి స్టేషన్‌కి వచ్చారు. దారిపొడుగునా అప్పగింతలు పెడుతూనే వుంది మంజుల. "వదినా! శైలుకి రోజూ కోడిగ్రుడ్డు. పాలు ఇవ్వు. ప్రొద్దుట టిఫిన్‌కి దానికి బ్రెడ్ అలవాటు. కొద్దిగ టోస్ట్ చేసి ఇవ్వు. నెయ్యి ఎక్కువగా వాడకు" అన్నిటికీ వూకొట్టింది పద్మ. "దానికి అస్తమానం జలుబు చేస్తుంది వదినా! దాని పెట్టెలో స్వెట్టరు, మేజోళ్ళు పెట్టాను, రాత్రిళ్ళు వేసి పడుకోబెట్టు" తనొక్కతే పిల్లను పెంచుతున్నది. చెప్పే కబుర్లు వింటూంటే పద్మకి చిర్రెత్తు కొచ్చింది కాని అనవసరంగా, గొడ వెందుకని మౌనంగా వుండిపోయింది. ఆకలికి ఒక టానిక్కు. తిన్నది అరగ టానికి ఒక మందు, జ్వరానికి ఒకటి, దగ్గుకొకటి ఇలా ఎన్నోమందుల పేర్లు వ్రాసి ఇచ్చింది మంజుల. మళ్ళీ ఏకరువు పెడుతూంది. పద్మకి చిరాకేసి ప్రయాణీ కులకేసి దృష్టి సారించింది. "వదినా! పండ్లరసం, పాలు రెగ్యులర్‌గా ఇవ్వండి. దాని ఖర్చుకి నెలనెలా నేను వంద రూపాయలు పంపుతాను" అంటున్న

తిరిగింది పద్మ. కోపంగా తనకేసి చూస్తున్న వదిన చూపులలోని వేడిని గమనించే స్థితిలో లేదు ఆతల్లి ఆతురత. ఇక మాటలు చాలించండి, అంటూ శైలు ముందుకు సాగిపోయింది. వికలమైన మనస్సుతో ఇంటికి వచ్చింది పద్మ.

భర్త వచ్చి రావడంతోటే అతని మీద విరుచుక పడింది. "ఏమిటి మీ అన్నాచెల్లెండ్ర వుద్దేశం? డబ్బు పంపుతుండట గదా! మీ ముద్దుల చెల్లెలు. ఇదేమైనా పూటకూళ్ల ఇల్లు అనుకుందా? ఆ సంగతి ముందే తెలిసివుంటే శుభ్రంగా ఏ బోర్డింగ్‌లోనే చేర్పించమనేదాన్ని" పద్మ కోపంతో, అవమానంతో వుడికి పోతూంది. వెంకట్రావుకి భార్యని చూస్తే జాలేసింది "ఛా..."ఎందుకలా అపార్థం చేసుకుంటావు? పిల్లలు కలవాళ్ళం కదా అని..." "అందుకని ఆవిడ దానంచేస్తే మీరు భిక్ష పట్టారా?" "మంజుల ఛాదస్తంగా ఏదో అన్నది నువ్వేం పట్టించుకోకు. అవసరం అయితే వాడుకుందాం. లేదంటే తిప్పిఇద్దాము. భార్యని అనునయిస్తూ అన్నాడు వెంకట్రావు. నా పిల్లలతో బాటు అనుకున్నాను. కాని ఆపిల్లని పేయింగ్‌గెస్టుగా నేను గ్రహించలేదు.ఇది మీరూ, మీ చెల్లి గుర్తుంచుకోండి" అంటూ ఆ ప్రసంగాన్ని అంతటితో ఆపేసింది పద్మ.

కాలండర్‌లోని కాయితాలు రెండిటివి గేండ్లశైలు. మూడవ కాయితం కేసి చూస్తున్న శైలుతోపద్మ "శైలూ! ఇంక నాలుగైదు రోజుల్లో మీ అమ్మ వచ్చేస్తుంది. అమ్మతో వెళ్ళి అత్తయ్యను మర్చిపోతావు కదూ!" అంది ఊహూ! మమ్మీని కూడ ఇక్కడే వుండమంటాను" అంది ముద్దుగ శైలు. "నా తల్లే" అంటూ ఎతుకుని ముద్దాడింది పద్మ. "ఏమిటో అత్తాకోడండ్లిద్దరూ మురిసి పోతున్నారు" అంటూ టెలిగ్రాం చేతపట్టుక వచ్చాడు వెంకట్రావు. "మీ కోడలు ఇక్కడే వుండిపోతుందటండీ! అంది పద్మ మళ్లీ శైలును ముద్దు పెట్టుకుంటూ. "ఇంకెన్నాళ్ళులే ఆ మురిపం! మంజుల రేపు సాయింత్రం వస్తానని టెలిగ్రాం ఇచ్చింది "మమ్మీ వస్తుందా మామయ్యా" అంటూ గంతులేసింది శైలు.

ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్‌లో వస్తున్న మంజుల మనస్సు మహా త్వరితగతి పరుగులు తీస్తూంది ఈ రెండు నెలలు ఎలా వుందో కాని ఈ రెండు గంటలుండటం కష్టమైపోతూంది మంజులకి. తనకే రెక్కలుంటేనా! శైలు దగ్గర ఈ క్షణం వాలిపోనూ. అనుకుంది మంజుల. ఏం బెంగెట్టుకోలేదు, కులాసాగానే వుంది, అంటూ అన్నయ్య ఉత్తరాలు వ్రాస్తూనే వున్నాడు. కాని మంజుల హృదయం మాత్రం కూతురి కోసరం



కొట్టుకపోయింది. మంజుల భర్త కూడ ప్రయాణమయ్యాడు. కాని లాస్ట్ మినిట్ లో మినిష్టర్ ప్రోగ్రాం రావడంతో ఆగి పొయ్యాడు.

స్టేషన్ లో ఆగీ ఆగకముందే బయట కురికింది మంజుల. కళ్ళు ప్లాట్ ఫారమ్ ని అన్వేషిస్తున్నాయి. ఇంతలో "మమ్మీ" అంటూ శైలు పరుగున వచ్చి మంజులని వాటేసుకుంది. వెనకాలే వెంకట్రావు చిరునవ్వుతో వచ్చాడు. వంగి కూతుర్ని అమాంతం ఎత్తుకొని హృదయానికి అదుముకుంది మంజుల. బొద్దుగా, ఆరోగ్యంగా, కళగా వున్న కూతుర్ని ఆప్యాయంగ చూసుకుంది మంజుల. "శైలు వెయిట్ ని కళ్ళతోనే వే చేస్తున్నట్లున్నావ్" అంటూ దగ్గరగా వచ్చాడు వెంకట్రావు.

"పో అన్నయ్యా" అంటూ కూతుర్ని మరింత గట్టిగా హృదయానికి అదుముకుంది.

మంజుల రాకతో ఇంట్లో చెప్పలేనంత హడావిడి. "మమ్మీ. మమ్మీ" అంటూ శైలు నోరు మూత వేయకుండ కబుర్లు చెబుతూంది. ఎప్పుడూ తనవెంట తిరిగే శైలు, అమ్మ కూతురయిపోయింది అని నవ్వుకుంది పద్మ. అందరితోబాటు శైలు కూడ ఇడ్లీలు, రొట్టెలు ఇష్టంగా తింటూంది, ఆకలి అత్తయ్యా! అన్నంపెట్టు అని అడిగి భోంచేస్తూంది. ఆఖరికి చారుఅన్నం అయినా సరే ఎంతో రెలిష్ చేసి కూతురు తినడం మంజులకి ఆశ్చర్యం కలిగించింది. ఇంటి దగ్గర రకరకాల డిష్ స్ తో తినమని

పండ్లరసం. పాలు అయినా బ్రతిమాలి, బెదిరించి ఇవ్వవలసి వచ్చేది కాని ఇక్కడో! అన్నయ్య పిల్లలతోపాటు ఆబగ అన్నము తినేయటం చూస్తే మంజులకి కొంచెం బాధ కూడ అని పించింది. తానంతగా చెప్పిపోయినా, వీళ్లు తన కూతుర్కి స్పెషల్‌గా ఏమీ ఇవ్వడం లేదు అన్నది స్పష్టమయింది. ఏదయితేనేం తన కూతురు ముందుకన్న కూడ ఆరోగ్యంగావుంది, అని మనసును సరిపెట్టుకో ప్రయత్నించింది. కాని హృదయంలో ఎక్కడో కలుక్కు మంటూనేవుంది. శైలుతో సంతోషంతో కబుర్లు చెబుతూంది. కాని అన్నయ్య, వదినతో మాత్రం కాస్త ముభావంగా వుండిపోయింది.

మంజుల ఊరికి ప్రయాణమవుతూంది. పద్మ అవీ, ఇవీ తినుబండారాలు తయారుచేసింది. చక్కిలాలు, సున్ని వుండలు పెడుతూంటే "ఇవన్నీ ఎవరు తింటా రొదినా!" అంది విసుగ్గా మంజుల. "అదేంటి మంజూ! సున్ని వుండలంటే శైలుకి ప్రాణం" అంది పద్మ. "ఔను, మమ్మీ. భలేగా వుంటాయి. అత్తయ్య రోజూ నాకు నెయ్యివేసి మధ్యాహ్నం పెడుతుంది" అంటూ ఒకటి తీసి నోటిలో వేసుకుంది శైలు. మంజుల మరేమీ మాట్లాడక పెట్టె సర్దుకోసాగింది. శైలుకి పెందలాడే చంక నేసుక వెళ్ళింది. జలజ, గిరిజలు శైలు వెంబడే తిరుగుతున్నారు

"మంజూ!" అంటూ వెంకట్రావు చెల్లెలి దగ్గరి కొచ్చాడు. "ఏమిటి?" అన్నట్లు లేచి నించుంది మంజుల "ఇదిగో నమ్మా! నువ్వు ఈ రెండు నెలలు పంపిన డబ్బు" అంటూ రెండు వంద రూపాయల నోట్లు చెల్లెలి చేతిలో పెట్టాడు. పరధ్యానంగా నడుస్తున్న పాంథునికి పెద్ద ఎదురు దెబ్బ తగిలి నట్లయి, మంజుల చివ్వున తలెత్తి చూసింది. చిరునవ్వుతో వెంకట్రావు చెల్లి చేతిలో పెట్టాడు "అన్నయ్యా" అంటూ ఏదో అనబోతున్న మంజులను వారిస్తూ మంజుల చేతిని మూసేశాడు. "అయితే! మీరు నా కోసరం అనవస రంగా అప్పులయినా చేస్తారు కాని నా డబ్బు వాడుకో రన్నమాట" మంజుల కొంచం వుక్రోషంగా అంది. "మంజూ! ఎవరు చెప్పారు నీకు మేము అప్పుల్లో బ్రతుకు తున్నామని. పెద్ద డాక్టరువయితే అయ్యావు కాని నీ చిన్నప్పటి తొందర తనం అవివేకం ఏమీ పోలేదు. నీ కూతురి పోషణ కోసరం అప్పులు చేసేంత దుస్థితికి ఈ అన్నయ్య ఇంకా రాలేదు. నాతో అంటే అన్నావు కాని మీ వదినతో ఈ మాట అనేవ్, చాలా బాధపడుతుంది" అంటూ వచ్చినంత నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు వెంకట్రావు.



చేతిలో డబ్బుతో నిలబడ్డ మంజులకి చెప్పలేనంత బాధ కలుగసాగింది. ఛీ...ఛీ...తానెంత అహంభావి! ఎంత మూఢురాలు! తన డబ్బు వాళ్ళేదో స్వంతానికి వాడేసుకున్నారని ఎంత కుత్సితంగా ఆలోచించింది. ధన మదాంధకారం అంటే ఇదే కాబోలు. మధ్య తరగతి కుటుంబీకుడు అన్నయ్య అన్న చులకన భావమే కదూ, తనని నెల నెలా డబ్బు పంపించేలా చేసింది. ఎంత మెత్తగ గుణపాఠం చెప్పారు తనకి. అన్నయ్య పిలలు తన రక్తసంబంధీకులే అయినా ఏనాడూ వాళ్ళని దగ్గరికి చేరదీయలేదు అత్తయ్యగా ఆప్యాయత చూపలేదు. ఇంతెందుకు? ఇంతదూరం వస్తూ పసి పిల్లలకి ఏమైనా తెద్దామన్న ఆలోచన అయినా రాలేదు. నెల నెలా పంపిస్తున్నాను కదా అన్న ధీమా కదూ తనది! కాని తన వదినో! తన పిల్లలకన్న ఎక్కువ అనురాగంతో చూసుకుంది తన కూతుర్ని" సిగ్గుతో, అవమానంతో. లజ్జతో చితికి పోసాగింది మంజుల,

"అరే! వుండండ్రా! అత్తయ్యకి చూపనీ" అంటూ పద్మ శైలుని మంజుల దగ్గరికి తెచ్చింది. క్రొత్త లంగా, జాకెట్టులో ముద్దొస్తూంది శైలు. వెనకే పాత బట్టలతోనే వున్నా గిరిజ, జలజలు చిరునవ్వులతో వెలిగిపోతున్నారు. వాళ్ళందర్నీ చూస్తూంటే తానెంత అల్పురాలో అర్థమవసాగింది. పద్మ శైలుని దింపి

...ల ఎలా వున్నది. అమ్మా! ఎలా వుంది" అంటూ తన దగ్గరికి వచ్చిన శైలుతో బాటు గిరిజ. జలజలను దగ్గరకు తీసుకుంది మంజుల.

పసుపు. కుంకుమతో బాటు చీర, మంజుల చేతిలో పెట్టింది పద్మ. చీరతో బాటు చటుక్కున వంగి వదిన పాదాలని చేతితో తాకింది మంజుల. ఆడబిడ్డ చేష్టకి ముగ్ధురాలైన పద్మ, మంజులని ఆప్యాయంగా లేవనెత్తింది. మంజుల కండ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. "ఛా... ఏంటిది ? మంజూ! ఏమయింది" అంటూ పద్మ మంజు కళ్ళు తుడిచింది. "వదినా! నా కూతురి పోషణకి విలువకట్టి డబ్బు పంపానే కాని నీ మాతృ ప్రేమామృతానికి విలువ కట్టలేనమ్మా" అంటున్న మంజులని వారించింది పద్మ. మంజుల ఆవేశాన్ని అర్థం చేసుకుంది. "బాగానే వుందమ్మా నువ్వనేది ! అది నీకు కూతురే కాని నాకేమీ కాదా! నా ముగ్గురి పిల్లలతో బాటు అది నాలుగో పిల్ల అయింది. దాని కోసం నేనేం ప్రత్యేకం ఖర్చు పెట్టలేదు. నువ్వు అనవసరంగా నాకేదో గొప్పదనం ఆపాదించకు. ఒంటిత్తుగ వున్న పల్లమా, నలుగురిలోకి వచ్చాక కాస్త వుషారుగా వుంది, ఆరోగ్యంగా వుంది" సామాన్యంగా చెప్పుక పోయింది పద్మ. కాని మంజుల తన ఆవేశాన్ని అరికట్టుకోలేక పోయింది. తన చేతిలోని డబ్బుతీసి మేనగోడళ్ళిద్దరి చేతిలో పెట్టింది. వారించబోతున్న వదిన్ని అవతలకి నెట్టింది "నా ఇష్టం ! నా మేనగోడళ్ళకి నే నిచ్చుకుంటాను. నువ్వు అనవసరంగా జోక్యం కలుగ జేసుకోకు" అంటూ గోముగా కసిరింది పద్మని. "అలా అన్నావు బాగుంది. ఎన్నాళ్ళనుంచో కలలు కంటున్నారు కదా, కంచిలంగాలో అంటూ, అత్త పేరు చెప్పి కుట్టించుకోండి. పిల్లలూ !" అని అంటున్న భార్య వేపు అనురాగంగా చూస్తూ వచ్చాడు వెంకట్రావు. "అంతా మీ అమ్మాయిలు పంచుకోవడమేనా! నా కొడుక్కి వాటా ఏది ? అన్నాడు కొంటెగా ! "కొడుక్కి కోడలే బహుమతి" అంది నవ్వుతూ మంజుల. అందరు గొల్లున నవ్వారు. ఎందుకో అర్థం కాక పోయినా శైలుకూడా నవ్వేసింది.